క్లుప్తంగా

18న ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు చేస్తున్న వేద పండితులు

నాగులుప్పలపాడు: మండలంలోని మద్దిరాల పాడు గ్రామంలో ఈ నెల 18వ తేదీ మహా గణపతి, జంటనాగులు, ప్రసన్నాంజనేయస్వామి, గురుదత్తాత్రేయ, సరస్వతి శిఖర జీవ ధ్వజ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్



అరెస్ట్ చేసిన వారితో ఎస్సై, సిబ్బంది

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.9,862 నగదు, 7 మొబైళ్లు, 3 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బ్రహ్మానాయుడు తెలిపారు.

21న గెస్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు: గెస్ట్ అధ్యాపకులకు ఈ నెల 21వ తేదీ స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ సబ్జెక్టులకు సంబంధించి కామర్స్ అధ్యాపకులకు మాత్రమే ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మహిళలకు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని, పోస్టు గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని సూచించారు. నెట్/స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు డెమో క్లాసులకు, ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

● డీఈఓ సుభద్ర

ఒంగోలు సెంట్రల్: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేసేలా జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీవైఈఓ, ఎంఈఓలు అవగాహన కల్పించాలని డీఈఓ డి.సుభద్ర పేర్కొన్నారు. డీవార్మింగ్ మాత్రల ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియజేసేలా నోటీస్ బోర్డుల్లో, డైరీల్లో రాయాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. పాఠశాలల నుంచి ఇండెంట్ తీసుకుని వైద్యశాఖకు, సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేసి మాత్రలు సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. మాత్రలు భోజనం తర్వాత వేసి నీరు తాగించాలని సూచించారు. ఎవరికైనా రియాక్షన్ వస్తే వైద్యశాలకు తరలించాలని తెలిపారు.

20న ధభోల్కర్ వర్ధంతి సభ

ఒంగోలు: ఈనెల 20న డాక్టర్ ధబోల్కర్ వర్ధంతి సభను స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడు మొగల్ కాలేషాబేగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25 ఏళ్లకు పైగా మూఢనమ్మకాల నిర్మూలనకు పోరాటం చేసి చివరకు మతోన్మాదుల తుపాకీ తూటాలకు బలైన దభోల్కర్ ఆశయ సాధనకు అందరు కలిసి రావాలన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో హేతువాద నాస్తిక, జనవిజ్ఞాన వేదిక, అభ్యుదయ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

24 గంటలపాటు వైద్యసేవలు బంద్

● కోల్‌కతాలో వైద్యురాలి దారుణ హత్యపై ఐఎంఏ ఆగ్రహం

మార్కాపురం టౌన్: ఈనెల 9వ తేదీన కోల్‌కతా నగరంలోని ఆర్.జి.కార్ ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి ఆపై హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) జాతీయ కమిటీ పిలుపు మేరకు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, కార్యదర్శి ఫణి ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలు 24 గంటలపాటు వైద్యసేవలు(అత్యవసర వైద్యసేవలు మినహా) నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. వైద్యులపై దాడులు నానాటికీ ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని కోరారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సంతపేటఆలయంలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మి అమ్మవారు



లాయర్‌పేట సత్యసాయి మందిరంలో సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు



సాయి మందిరంలో పూజలందుకున్న వరలక్ష్మి

వరాలివ్వమా.. వరలక్ష్మి..

● అమ్మవారి ఆలయాల్లో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు
● సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రత పర్వదినం సందర్భంగా నగరంలోని ఆలయాల్లో కుంకుమార్చన అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగమూరు రోడ్‌లో మిలటరీ కాలనీ యానాది సంఘంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి శ్రీసూక్తంతో అభిషేకాలు చేశారు. పుష్పాలంకరణ అనంతరం శ్రీచక్రానికి దేవి ఖడ్గమాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో దివ్యదర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



సంతపేట సాయి మందిరంలో వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న మహిళా భక్తులు



అచలానంద ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



నాగులుప్పలపాడు: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నాగులుప్పలపాడు: వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం మండలంలోని అన్ని ఆలయాల్లో మహిళా భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. మహిళలు స్వగృహాల్లోనూ భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఆలయాల్లో పూజారులు వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ ప్రభుత్వంలో దళితులపై వివక్ష

● మాజీ ఎంపీ చింతా మోహన్

ఒంగోలు సిటీ: టీడీపీ ప్రభుత్వంలో దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని మాజీ ఎంపీ చింతా మోహన్ విమర్శించారు. ఒంగోలులోని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు సరైన పోస్టింగులు ఇవ్వడం లేదని విమర్శించారు. దేశంలో దళితులు 20 శాతం ఉన్నారన్నారు. భారతీయ జనతాపార్టీ పరిపాలనలో, ప్రాంతీయ పార్టీల పరిపాలనలో దళితులకు అన్యాయం జరుగుతోందన్నారు. కారంచేడు ఘటనకు సంబంధించి ఆరుగురు దళితులు చనిపోతే.. నేరస్తులకు శిక్షలు పడలేదన్నారు. తప్పు చేసిన వారు కోర్టుల నుంచి తప్పించుకుంటున్నారన్నారు. చుండూరు దళితులపై దౌర్జన్యం చేయడమే కాకుండా 8 మందిని 1991వ సంవత్సరంలో చంపారని, కానీ, నేరస్తులు కోర్టుల ద్వారా తప్పించుకుంటున్నారని అన్నారు. న్యాయ వ్యవస్థకు కళ్లు లేవు, చెవులు మాత్రమే ఉన్నాయన్నారు. మొన్న ఇచ్చిన క్లాసిఫికేషన్ కూడా దళిత వ్యతిరేక జడ్జిమెంట్ అని అన్నారు. అనాథిగా ఐదు వేల సంవత్సరాలు కష్టనష్టాలు పడిన దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నెహ్రూ, అంబేడ్కర్, గాంధీ ఆలోచనలతో 14 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. దీనిపై విదేశీ కుట్రలు జరుగుతున్నాయని, దీనికి తోడుగా భారతీయ జనతా పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్, కొన్ని ప్రాంతీయ పార్టీలు కలిసి దళితులను విభజించు.. పాలించు అనే ఉద్దేశంతో పనిచేస్తున్నాయని అన్నారు. ఆగస్టు 1న ఏడుగురు జడ్జిల ధర్మాసనం జడ్జిమెంట్ ఇవ్వగా, నేషనల్ కోర్టులలో 34 మంది జడ్జిలుంటే.. అందులో ఒకే కులానికి చెందినవారు 20 మంది ఉన్నారన్నారు. ఓబీసీలు ముగ్గురే ఉన్నారన్నారు. నిరుపేద దళితుల్లోని క్లాసిఫికేషన్ జడ్జిలలో ఎందుకు లేదని ప్రశ్నించారు. అందరూ సంపన్నులేనని, గవర్నర్ పిల్లలు జడ్జిలు, జడ్జిల పిల్లలు జడ్జిలు.. ఇక్కడ లేదా క్రిమిలేయర్, ఇక్కడ ఉందా క్లాసిఫికేషన్ అని చింతా మోహన్ ప్రశ్నించారు. ఏపీలో ఏ అంటే అమరావతి, పీ అంటే పోలవరం అని, పోలవరంకు 40 సంవత్సరాల నుంచి ఖర్చుపెడుతూనే ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టారో చంద్రబాబును పది సార్లు అడిగానని, వినబడనట్టుగా, తెలియనట్టుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎందుకు భయపడుతున్నావు చంద్రబాబూ అంటూ చింతామోహన్ ప్రశ్నించారు.

పర్యావరణ సమతుల్యతతోనే భవిష్యత్

● ఏకేయూ వీసీ, ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి



ఎన్ఎస్ఎస్ యూనిట్లకు సంబంధించిన పత్రాలు ఆవిష్కరిస్తున్న వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: పర్యావరణ సమతుల్యతతోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. యూనివర్శిటీ పరిధిలో 59 ఎన్ఎస్ఎస్ యూనిట్లు మంజూరు కావడంతో దానికి సంబంధించిన పత్రాలను ఆయన శుక్రవారం తన చాంబరులో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని నివారించి సమతుల్యతను కాపాడేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న అన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్లను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి బదిలీచేశామన్నారు. ఇది తొలి విడత మాత్రమే అని, రెండో విడతలో మరో 50 యూనిట్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. సామాజిక చైతన్యం, గ్రామీణ అభివృద్ధి, మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం, నిరక్షరాస్యత నిర్మూలన, వృద్ధుల సంక్షేమం, స్వచ్ఛ భారత్, విద్యా విజ్ఞానాన్ని అందించడంలో అట్టడుగు వర్గాల ప్రజలతో మమేకమై వారిలో చైతన్యాన్ని నింపడం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి



గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం: స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివని మార్కాపురం గౌడ సంఘ అధ్యక్షుడు గజ్జ రమణగౌడ్ పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రమణగౌడ్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో ఒక సామాన్య కల్లుగీత కార్మికుని కుటుంబంలో జన్మించి భారతదేశ స్వాతంత్య్రం కోసం మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, నెహ్రూ, నేతాజీ లాంటి దేశ నాయకులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొని ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. నూతన మద్యం పాలసీలో తెలంగాణాలో మాదిరిగా ఏపీలో కూడా గౌడ కుటుంబాలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం సలహాదారులు బత్తిని శ్రీనివాసరావుగౌడ్, గౌరవ అధ్యక్షుడు జూపల్లి హనుమయ్యగౌడ్, గౌరవ సలహాదారులు కొమర వెంకటేశ్వర్లు గౌడ్, గౌడ సంఘ ఉపాధ్యక్షుడు గజ్జ రంగారావు గౌడ్, సహాయ కార్యదర్శి గుండ్ల వెంకటేశ్వర్లు గౌడ్, కొమరా రూపేష్ గౌడ్, బత్తిని సాయి చైతన్య గౌడ్, దొంత రాఘవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె చెరువు వద్ద వేటగాళ్లు అడవి పందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి 5 గేదెలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన సానికొమ్ము వెలుగొండారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి పశు వైద్య సిబ్బందితో కలిసి ఎస్ఐ మాధవరావు సమక్షంలో మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులకు నివేదిక అందజేస్తామని పశువైద్యాధికారి తెలిపారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని, గేదెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తనకు నష్టపరిహారం అందించిఆదుకోవాలనిరైతు వెలుగొండారెడ్డి కోరారు.

క్యాంటీన్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి



టిఫిన్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చీమకుర్తి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రారంభించి అక్కడే టిఫిన్ చేశారు. చీమకుర్తిలో గ్రానైట్ కార్మికులు ఎక్కువగా ఉన్నందున అన్నా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు, నాయకులు మన్నం ప్రసాద్, పుట్టా బ్రహ్మయ్య, ఎడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

18న మార్కాపురంలో జనవిజ్ఞాన వేదిక సభ

ఒంగోలు టౌన్: ఈనెల 18వ తేదీన మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక వార్షిక సభలను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎం. గేయానంద్ ప్రారంభోపన్యాసం చేస్తారని, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు వార్షిక ప్రణాళికపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ సమాజ నిర్మాణాల ఏర్పాటు లక్ష్యంగా జేవీవీ గత 36 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మెజీషియన్ రామన్ చేత పలు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, విద్యావంతులు సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు రూరల్: ఒంగోలు మండలంలోని త్రోవగుంట, కరవది విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ మల్లికార్జున్ తెలిపారు. సాధారణ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఉత్తమ వైద్యునికి అభినందనలు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఆనందమోహన్

మద్దిపాడు: మద్దిపాడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఆనందమోహన్ ఉత్తమ వైద్యునిగా ఎంపికై గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో జిల్లాకు చెందిన మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ఆయనను అభినందనలు తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉంటూ ప్రసవాల రేటు పెంచడం, ఉత్తమ సేవలు అందించడం ద్వారా ఉత్తమ వైద్యునిగా ఎంపికవడంపై ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, తదితరులు డాక్టర్ ఆనందమోహన్‌ను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



చీమకుర్తి బాలికల హాస్టల్లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు



సంతనూతలపాడులో పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు

చీమకుర్తి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు స్థానిక బాలికల హాస్టల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శుక్రవారం హాస్టల్‌ను సీఐ సందర్శించారు. సమాజంలో జరిగే పలు రకాల నేరాల గురించి వివరించారు. అలాంటివి జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థినులు పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌తో వేధించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా తనకు ఫోన్ చేయాలని, తన ఫోన్ నంబర్ 91211 02131ను హాస్టల్ విద్యార్థినులంతా నోట్ చేసుకోవాలని తెలిపారు.

సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన రూరల్ సీఐ...

ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు శుక్రవారం సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీసులతో మాట్లాడారు.

బసవన్నపాలెం హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఎన్‌క్వాస్ సభ్యులు



బసవన్నపాలెం హెల్త్ సెంటర్‌లో డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ కృష్ణప్రసాద్‌తో వైద్య సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం హెల్త్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ (ఎన్‌క్వాస్) సభ్యులు డాక్టర్ సురేష్‌కుమార్, జిల్లా కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణప్రసాద్ శుక్రవారం సందర్శించి ట్రయల్ రన్ నిర్వహించారు. పలు విషయాలను వారు పరిశీలించారు. ఆస్పత్రిలో రోగి చేరిన సమయం నుంచి డిశ్చార్జి అయ్యేంత వరకూ డబ్బు వసూలు చేయకుండా సేవలను ఉచితంగా అందించారా, ఆస్పత్రిలో అందించే సేవలకు మీరు సంతృప్తి చెందారా, ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి మీకు వైద్య మిత్ర సహకారం ఏ విధంగా అందింది, డిశ్చార్జ్ సమయంలో పేషెంట్‌కు అవసరమైన మందులు 10 రోజులకు ఇచ్చారా..లేదా..? అంటూ పలు విషయాలపై రోగుల అభిప్రాయాలు సేకరించారు. హెల్త్‌సెంటర్‌లో పరిశుభ్రత, మందుల లభ్యత వంటి విషయాలను పరిశీలించారు. మరోమారు హెల్త్ సెంటర్‌ను పరిశీలించడానికి రానున్నట్లు వారు తెలిపారు. రికార్డులన్నీ పక్కాగా నిర్వహించాలని, ఎన్‌క్వాస్ నిబంధనలను అనుసరించి పనిచేసే సెంటర్లకు సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రజితకుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఎంఎల్‌హెచ్‌పీ జెస్సీ రోజ్‌పాల్, ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయం



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: భారత రాజకీయాలపై చెరగని ముద్ర వేసిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి ఏబీ వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయమని బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బి.వి జయరావు పేర్కొన్నారు. వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక, సంక్షేమ, మౌలిక రంగాల్లో వేగం పెంచిన ఘనత వాజ్‌పేయిది అని కొనియాడారు.